క్లుప్తంగా

సన్మానం



ఎస్‌ఐలను సన్మానిస్తున్న జెడ్పీటీసీ

శివ్వంపేట: బదిలీ అయిన ఎస్‌ఐతో పాటు ఇక్కడికి వచ్చిన ఎస్‌ఐని మండల జెడ్పీటీసీ మహేశ్ గుప్తా గురువారం సన్మానించారు. మండలంలో పనిచేసి బదిలీ అయిన ఎస్‌ఐ రమాకాంత రావుతో పాటు ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన మహేందర్‌రెడ్డిలను ఆయన సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు యాదగౌడ్, నవీన్, రాంచంద్రంగౌడ్ తదితరులు ఉన్నారు.

ఉచిత యోగా శిక్షణను అందరూ వినియోగించుకోండి

తూప్రాన్: జీవన మంత్ర యోగా ఫౌండేషన్, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ మెదక్ ఆధ్వర్యంలో ఈ నెల 16న రథసప్తమి పురస్కరించుకొని పట్టణంలోని లక్ష్మి గార్డెన్‌లో ఈ నెల 8 నుంచి 16వ తేదీ వరకు (ఉదయం 6.30 నుంచి 7.30 వరకు) ఉచిత యోగ శిక్షణను నిర్వహిస్తున్నట్లు ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ అల్లి నరేశ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలనుకునే వారు 94923 07071, 94912 30240 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

రైతుబీమా చెక్కు అందజేత

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని టెంకటి గ్రామానికి చెందిన మనూర్ పద్మకు మంజూరైన రైతుబీమా చెక్కును మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి గురువారం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కోణం అంజయ్య, వార్డు సభ్యులు రవీందర్, గడ్డం రాములు, సంగమేశ్వర్, కాశీరాం, భూమయ్య తదితరులు ఉన్నారు.

చంద్రశేఖరశర్మకి భానుమూర్తి స్మారక అవార్డు అందజేత



పురస్కారాన్ని అందుకుంటున్న చంద్రశేఖరశర్మ

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రానికి చెందిన రామాలయ అర్చకుడు గుడి చంద్రశేఖరశర్మకు స్వర్గీయ గంగు భానుమూర్తి స్మారక పురస్కారాన్ని అందుకున్నారు. బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని బొగ్గులకుంట ఆంధ్ర సారస్వత పరిషత్ భవనంలో తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ అధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, చైతన్య, దర్శనంశర్మ, ధూపదీప నైవేద్య రాష్ట్ర అర్చక సంఘం అధ్యక్షుడు దౌల్తాబాద్ వాసుదేవశర్మ, మొంగపతి రావు, బండారు రాంప్రసాద్ పాల్గొన్నారు.

నర్సాపూర్ ఎస్‌ఐ బదిలీ

నర్సాపూర్: నర్సాపూర్ ఎస్‌ఐగా పని చేసిన శివకుమార్ సిద్దిపేట టౌన్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సిద్దిపేట జిల్లా కుకునూర్‌పల్లిలో ఎస్‌ఐగా పని చేస్తున్న పుష్పరాజ్ బదిలీపై ఇక్కడికి రానున్నారు. ఈమేరకు బుధవారం రాత్రి ఉత్తర్వులు వచ్చాయని ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు.

మహిళలకు అండగా అభయ ఫౌండేషన్



కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ మండలాధ్యక్షుడు నరేందర్‌చారి

మనోహరాబాద్(తూప్రాన్): పేద మహిళలకు అభయ ఫౌండేషన్ సేవా సంస్థ అండగా ఉంటుందని ఫౌండేషన్ అధినేత బాల చందర్ అన్నారు. గురువారం మండలంలోని కాళ్లకల్ గ్రామంలో అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని బీజేపీ మండలాధ్యక్షుడు నరేందర్‌చారి ప్రారంభించారు. కార్యక్రమంలో మహిళా సమైఖ్య సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

తూప్రాన్: కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఆరు గ్యారంటీలతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు నాగేశ్ ఆధ్వర్యంలో 50 మంది బీఆర్‌ఎస్ నాయకులు నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌గుప్తా, నాగరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యమే లక్ష్యం

కౌడిపల్లి(నర్సాపూర్): స్పెషల్‌డ్రైవ్‌లో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గురువారం కౌడిపల్లి ప్రత్యేక అధికారి ఎంపీడీఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కాలనీలో పేరుకుపోయిన చెత్తను ట్రాక్టర్‌డోజర్ ద్వారా శుభ్రం చేయించారు. రోడ్డుపైన చెత్త వేయొద్దని తడి, పొడి చెత్త వేరుచేసి చెత్త ట్రాక్టర్‌లో వేయాలని సూచించారు. దీంతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రత్యేక అధికారులు పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి

పెద్దశంకరంపేట(మెదక్): గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలని తహసీల్దార్, పెద్దశంకరంపేట పట్టణ ప్రత్యేకాధికారి గ్రేస్‌బాయి అన్నారు. గురువారం మండల కార్యాలయాల వద్ద శ్రమదానం నిర్వహించి పరిసరాలను శుభ్రం చేశారు. అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు, తాగు నీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వీణసుభాష్‌గౌడ్, ఆర్‌ఐ.శరణప్ప, జూనియర్ అసిస్టెంట్, గ్రామ కార్యదర్శి వెంకట్రాములు, అంగన్‌వాడీ టీచర్లు సరళ, స్వరూప తదితరులు ఉన్నారు.

గౌతోజీగూడెంలో పాఠశాలలో..

మనోహరాబాద్(తూప్రాన్): గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌ను కొనసాగిస్తున్నారు. పలు గ్రామాల్లో పలు వీధులను, మురికి కాల్వలను శుభ్రం చేశారు. దండుపల్లి జరిగే పనులను ఎంపీడీఓ యాదగిరిరెడ్డి పరిశీలించారు. గౌతోజీగూడెంలో పాఠశాల ఆవరణను గ్రామస్తులు శుభ్రం చేశారు.



పెద్దశంకరంపేటలో శ్రమదానం చేస్తున్న అధికారులు



కౌడిపల్లి ఎస్సీ కాలనీలో చెత్తను శుభ్రం చేస్తున్న ట్రాక్టర్ దోజర్



మనోహరాబాద్(తూప్రాన్): గౌతోజీగూడెంలో పాఠశాల ఆవరణను శుభ్రం చేస్తున్న గ్రామస్తులు

నిరుపయోగంగా దుకాణ సముదాయం

నర్సాపూర్: వ్యాపారస్తుల నుంచి ఆశించిన స్పందన లేదు. దీంతో దుకాణసముదాయం నిరుపయోగంగా ఉంది. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో రూ.80 లక్షలు వెచ్చించి, దుకాణ సముదాయంలో పది షెటర్లు నిర్మించారు. దానిని 19-11-2022న అప్పటి ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అనుసూయ తదితరులు ప్రారంభించారు. దుకాణ సముదాయం ప్రారంభించిన నాటికి కాంట్రాక్టర్‌కు పూర్తి స్థాయిలో బిల్లు రానందున షాపింగ్ కాంప్లెక్స్‌ను వ్యవసాయ మార్కెట్ కమిటీకి అప్పగించలేదని, బిల్లు వచ్చాక కాంట్రాక్టర్ అప్పటించే సరికి కొన్ని నెలలు గడిచి పోయాయని తెలిసింది. కాగా వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు దుకాణాల షెటర్లు కేటాయించేందుకు టెండర్ వేసినా వ్యాపారస్తుల నుంచి ఆశించిన స్పందన రాలేదు. పది దుకాణ మడిగెలకు కేటాయించేందుకు టెండరు వేయగా నాలుగు దరఖాస్తులే రావడంతో అధికారులు షెటర్ల కేటాయింపులను నిలిపివేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 20 దరఖాస్తులు వచ్చే వరకు దుకాణాలు కేటాయించకపోతే ప్రభుత్వానికి షెటర్ల ద్వారా వచ్చే అద్దె ఆదాయం రాకుండా పోతుంది. ఈ విషయమై వ్యవసాయ మార్కెట్ కమిటీ ఇన్‌చార్జి కార్యదర్శి సునీల్‌కుమార్ వివరణ కోరగా.. నిబంధనల మేరకు ఆయా సామాజిక వర్గాలకు షెటర్లను కేటాయించి టెండరు వేయగా తక్కువ దరఖాస్తులు రావడంతో షెటర్లు ఎవ్వరికి ఇవ్వలేదని చెప్పారు. మార్చి తర్వాత మరోసారి టెండర్లు వేస్తామన్నారు.



నిరుపయోగంగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో షెటర్లు

సబ్సిడీ గ్యాస్ కోసం సర్వే



కౌడిపల్లి(నర్సాపూర్): గ్యాస్ సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్



ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న తహసీల్దార్ సురేశ్ కుమార్

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాల్లో మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500 సబ్సిడీ గ్యాస్ కనెక్షన్‌ల కోసం సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. గురువారం కౌడిపల్లిలో పలువురు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఆన్‌లైన్ ఎంట్రీ చేశామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశం, అంగన్‌వాడీ టీచర్లు ఫరీద, కమల, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో గురువారం తహసీల్దార్ సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్యాస్ సబ్సిడీ గురించి ఇంటింటి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో నిజాంపేట పంచాయతీ కార్యదర్శి నర్సింలు, తిరుమల్, రాజు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలో బుధవారం ఇంటింటికీ చేపట్టే మహాలక్ష్మి గ్యాస్ కనెక్షన్ పథకం కింద సబ్సిడీపై నిర్వహిస్తున్న సర్వేను మండల ప్రత్యేకాధికారి నాగరాజు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంపీఓ లక్ష్మీనర్సింలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన

అల్లాదుర్గం(మెదక్): దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకే చెందుతుందని జిల్లా బీజేపీ నాయకులు రాములు, ప్రభాకర్ అన్నారు. గురువారం పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా అల్లాదుర్గంలో బీజేపీ కేంద్ర పథకాలపై ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు యాదగిరి, సాయిలు, రాజు, సదానందం తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్ రూరల్: మండలంలోని ఇబ్రహీంబాద్‌లో గురువారం బీజేపీ మండలాధ్యక్షుడు నీలి నరేశ్ ఆధ్వర్యంలో గావ్ చలో, బస్తీ చలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు రాజు, మొగులయ్య, లడ్డు, హరి, వెంకటేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): మరోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ డీసీసీబీ చైర్మన్ జైపాల్‌రెడ్డి అన్నారు. గురువారం పెద్దశంకరంపేటలోని బీజేపీ కార్యాలయంలో గావ్ చలో అభియాన్ వివరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు విఠల్, నాయకులు శ్రావణ్‌కుమార్, సుభాష్, అంజయ్య, అనిల్, విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): పార్టీలకు అతీతంగా బీజేపీని బలపర్చాలని నియోజవర్గ ఇన్‌చార్జి విజయ్ కోరారు. గురువారం మండల కేంద్రంలో గావ్ చలో కార్యక్రమంలో భాగంగా మాజీ సర్పంచ్ కుమార్‌గౌడ్, విద్యాలయ ప్రిన్సిపాల్ మల్లికార్జున్‌తో పాటు పలువురు ఆర్‌ఎంపీలను కలిసి బీజేపీకి మద్దతివ్వాలని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నియోజవర్గ అధ్యక్షుడు సాయిబాబా, బీజేపీ మండలాధ్యక్షుడు రాజు, మంజుల, శ్రీనివాస్, వెంకన్న, మధు, కిషోర్ ఉన్నారు.

డిప్యూటేషన్ వెళ్లినవారు అవసరంలేదు

డీఎంహెచ్‌ఓ ఆదేశాలు

చిన్నశంకరంపేట(మెదక్): వైద్యారోగ్యశాఖలో డిప్యూటేషన్లు రద్దుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో సిబ్బంది తిరిగి వస్తారని ఆశపడిన వారికి నిరాశే ఎదురైంది. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒక డాక్టర్, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక ల్యాబ్ టెక్నిషియన్ డిప్యూటేషన్‌పై జిల్లాల్లోని ఇతర ప్రాంతాలకు వెళ్లారు. దీంతో చిన్నశంకరంపేట పీహెచ్‌సీలో రోగులకు సరైన వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా పరిధిలో జరిగిన డిప్యూటేషన్లపై వెళ్లినవారు తిరిగిరావాల్సిన అవసరం లేదని, ఎక్కడ పనిచేస్తున్నారో అక్కడే విధులు నిర్వర్తించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ ఉత్తర్వులు జారీ చేయడంతో వైద్యసిబ్బంది వెనక్కురాకుండా ఉండిపోయారు.

కాలనీలో సమస్యలు పరిష్కరించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న కేసీఆర్ కాలనీవాసులు

రామాయంపేట(మెదక్): పట్టణంలోని డబుల్ బెడ్రూం (కేసీఆర్) కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు గురువారం తహసీల్దార్ రజనీకుమారికి వినతిపత్రం అందజేశారు. కాలనీలో అంతర్గత రహదారులు పాక్షికంగా శిథిలమయ్యాయని, నీటి ఎద్దడి, రవాణా సదుపాయం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు.



తొగిట శివారులో నరికివేసిన చెట్లు

నాటుతున్నారు.. నరికేస్తున్నారు

- పర్యావరణంపై అధికారులకు పట్టింపు లేదా.?
- ముందస్తు చూపు లేక నేలకొరుగుతున్న చెట్లు



కూచన్‌పల్లికి వెళ్లే దారిలో నరికిన చెట్లు

హవేళిఘణాపూర్(మెదక్): హరితహారంలో భాగంగా చెట్లను పెంచాలని ప్రభుత్వం చూస్తే.. ట్రాన్స్ కోఅధికారులు మాత్రం వాటిని నరికేస్తూ పర్యావరణానికి ముప్పు తెస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నాటిన దాదాపు 200 మొక్కల వరకు తొగిట నుంచి శేరికూచన్‌పల్లి వరకు విద్యుత్‌లైన్‌కు అడ్డుగా ఉందన్న సాకుతో కొమ్మలను మాత్రమే కొట్టివేయకుండా చెట్లనే నరికేస్తున్నారు. సామాన్యుడు ఒక చిన్న చిన్న మొక్కలు నరికితే జరిమానా విధించే ఫారెస్ట్ శాఖ అధికారులు మాత్రం వందల చెట్లను నరికివేస్తుంటే నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. మండలంలో ఎక్కడ మొక్కలు నాటిన విద్యుత్ వైర్ల కింద నాటకుండా చూసి ఇప్పటికైనా మొక్కలు నాటకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

మాకు సమాచారం లేదు

మండల పరిధిలోని తొగిట నుంచి శేరికూచన్‌పల్లి వరకు రోడ్డుకు ఇరువైపుల మొక్కలను నరికివేసిన విషయం మా దృష్టికి రాలేదు.

– డీఎఫ్‌ఓ మనోజ్‌కుమార్

ఉత్సవాలకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని ముట్రాజ్‌పల్లిలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయ తొమ్మిదవ వార్షికోత్సవానికి రావాలని కోరుతూ నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డికి మాజీ సర్పంచ్ సంజీవ్, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఉత్సవాలకు కోసం ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



ఎమ్మెల్యే సునీతారెడ్డిని ఆహ్వానిస్తున్న ప్రజాప్రతినిధులు

విద్యుత్ బిల్లు జీపీకి..

ఆదాయం మాజీ వార్డు సభ్యుడికి

చిన్నశంకరంపేట(మెదక్): గ్రామ పంచాయతీ బోరు నుంచి నిత్యం అక్రమంగా ట్యాంకర్‌లో నీటిని నింపుకొని వ్యాపారం చేస్తూ ఓ నాయకుడు ఆదాయం పొందుతున్న సంఘటన నార్సింగి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామ పంచాయతీ బోరుకు సంబంధించిన విద్యుత్ బిల్లు మాత్రం జీపీ చెల్లిస్తుండగా, నీటి వ్యాపారం చేస్తు ఆదాయం మాత్రం తాజా మాజీ వార్డు సభ్యుడు పొందుతున్నాడని గ్రామస్తులు తెలిపారు. నార్సింగి మండల కేంద్రంలో జీపీ వాటర్ ట్యాంకర్ లేకపోవడంతో ఇదే వార్డు సభ్యుడుకి చెందిన ట్యాంకర్‌ను ఇదివరకు వినియోగించారు. కానీ ప్రస్తుతం ట్యాంకర్‌ని వాడడం లేదు. అయినా ట్యాంకర్ నిర్వాహకుడు మాత్రం జీపీ బోరు నుంచి ట్యాంకర్‌లో నీరు నింపుకొని విక్రయిస్తున్నట్లు గ్రామస్తులు వాపోయారు. ఇదే విషయంపై నార్సింగి గ్రామ పంచాయతీ ఈఓ వెంకటేశంను వివరణ కోరగా.. ట్యాంకర్‌తో జీపీకి సంబంధం లేదని, జీపీ బోరు నుంచి నీరు తరలించకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

టీచర్లపై చర్యలు తీసుకోండి

నర్సాపూర్: తమ పిల్లలను కొట్టి గాయపర్చిన టీచర్లపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం డిమాండ్ చేశారు. నర్సాపూర్‌లోని జగన్నాథరావు కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న అవంతికను గురువారం మధ్యాహ్న భోజనం తినే సమయంలో టీచరు కవిత కుడి మోచేయిపై గట్టిగా కొట్టడంతో ఉబ్బిందని తల్లి మీనా తెలిపారు. ఇదిలా ఉండగా ఇదే పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న చౌహాన్‌ను ఉపాధ్యాయుడు అకారణంగా కొట్టాడని విద్యార్థి తండ్రి అజీజ్ ఆరోపించారు. ఈ విషయమై ఎంఈఓ బుచ్చానాయక్‌ను వివరణ కోరగా.. తాను శుక్రవారం పాఠశాలకు వెళ్లి విచారిస్తానని తెలిపారు.



గాయాలను చూపుతున్న విద్యార్థులు

అక్రమంగా మట్టి తరలింపు

మనోహరాబాద్(తూప్రాన్): పరిశ్రమల వాడలో బఫర్ జోన్, పార్క్‌ల కోసం కంచె వేసి ఉంచిన స్థలంలో మట్టిని ఇష్టారీతిన అక్రమార్కులు తరలిస్తున్నారు. దీంతో పార్క్ స్థలం గుంతలమయంగా మారింది. మండలంలోని ముప్పిరెడ్డిపల్లి శివారులోని ఐలా పరిశ్రమల వాడ నుంచి భూ బకాసురులు నిత్యం ఇష్టారీతిన అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. ఈ విషయంపై కలెక్టర్ సైతం 10 రోజులు క్రితం మండల అధికారులు, పోలీసులతో మాట్లాడినా.. ఫలితం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అక్రమంగా మట్టిని తరలించడంతో లోతుగా మారిన బఫర్‌జోన్ స్థలం

బహుమతులు అందజేత

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని పోతన శెట్టిపల్లి గ్రామంలో గురువారం గ్రామస్థాయి క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలను నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రఘువీరారెడ్డి సహకారంతో మండలాధ్యక్షుడు దయాకర్‌గౌడ్ విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సిద్ధిరాములు, శంకర్, నర్సింలు, మహిపాల్, సురేష్‌గౌడ్, ధర్మవీర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులతో విజేతలు

సంక్షిప్త వార్తలు

◆ **సన్మానం**



రేగోడ్(మెదక్): మండల కేంద్రం రేగోడ్‌లో నూతనంగా ఎన్నికైన ప్రెస్‌క్లబ్ బాధ్యులను లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ చైర్మన్ గంజి సంగమేశ్వర్, కార్యదర్శి చోటుమియా, మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌గుప్తా, మల్లికార్జున్, భస్వరాజ్, రాములు, వీరన్న, ప్రెస్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రామాయంపేట(మెదక్): ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రామాయంపేట సీఐ వెంకటేశ్‌ను నిజాంపేట మండలం కేవెంకటాపూర్ గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు గురువారం సన్మానించారు. అసైన్డ్ భూముల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు దయాకర్, మాజీ సర్పంచ్‌లు అరుణ్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు ధర్మారెడ్డి, సిద్ధరాంలు, నిజాంపేట ఎస్‌ఐ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



◆ **నకిలీ నోట్ల కేసులో ఒకరికి జైలు శిక్ష**

రేగోడ్(మెదక్): నకిలీ నోట్ల చెలామని పాత కేసులో ఒకరికి జైలు శిక్ష పడిందని ఎస్‌ఐ రాజయ్య గురువారం తెలిపారు. మండలంలోని పెద్దతండాకు చెందిన ధర్మానాయక్‌పై 2017లో నకిలీ నోట్ల చెలామని పాత కేసు ఉందని చెప్పారు. నిందితుడు ధర్మానాయక్‌కు మెదక్ అసిస్టెంట్ స్టేషన్ కోర్టు జడ్జి జితేందర్ మూడేళ్ల జైలు శిక్ష విధించారన్నారు.

◆ **మహాలక్ష్మి వివరాలు అందించండి**

చిన్నశంకరంపేట(మెదక్): మహాలక్ష్మి పథకం కోసం ఇంటింటికీ వచ్చే అధికారులకు లబ్ధిదారులు వివరాలు అందించాలని నార్సింగి మండల వ్యవసాయ అధికారి యాదగిరి కోరారు. గురువారం నర్సంపల్లి గ్రామంలో ఇంటింటికీ తిరిగి మహలక్ష్మి పథకం లబ్ధిదారుల నుంచి ఏఓ యాదగిరి వివరాలు సేకరించారు. గ్రామ కార్యదర్శి యాదగిరి, అంగన్‌వాడీ కార్యకర్త ఉన్నారు.

◆ **ప్రైవేట్ పాఠశాలల వివరాలు ఇవ్వండి**

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరంలో 61 రెసిడెన్సియల్, నాన్ రెసిడెన్సియల్ 59 పాఠశాలల ప్రవేశానికి ఎస్సీ విద్యార్థులకు అవకాశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

◆ **స్మారక చిహ్నం ఏర్పాటు**

తూప్రాన్: డిసెంబరు 4న తూప్రాన్ పట్టణ సమీపంలో గుట్టల్లో దుండిగల్ ఎయిర్ ఫోర్స్ శిక్షణ విమానం కూలిన ఘటనలో ఇద్దరు పైలేట్లు మృతి చెందిన పైలేట్లలో ఒకరైన అభిమాన్యురాయ్ స్మారక చిహ్నంను కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసి, నివాళులు అర్పించారు.

◆ **విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ**



కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని రాయిలాపూర్ ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు గురువారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రిగా తేజశ్రీ, డీఈఓగా సాత్విక, ఎంఈఓగా అనీల్‌చారి, హెచ్‌ఎంగా పల్లవి, ఉపాధ్యాయులుగా ప్రవళిక, సంజయ్, సందీప్, శ్రీహరి, సుశాంత్, రామ్‌చరణ్ విధులు నిర్వర్తించారు. పాఠశాల హెచ్‌ఎం బోయిని కృష్ణ, ఉపాధ్యాయులు అంజలిదేవి, వసంత తదితరులు పాల్గొన్నారు.

◆ **గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం**

చిన్నశంకరంపేట(మెదక్): మెదక్ ఎమ్మెల్యే సహకారంతో గ్రామాల అభివృద్ధికి కృషిచేస్తానని ఎంపీపీ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. గురువారం మండలంలోని అంబాజీపేట గ్రామంలో మండల్ పరిషత్ నిధులతో నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఎంపీటీసీ సింగమొల్ల జయమ్మతో కలిసి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ ఆవుల గోపాల్ రెడ్డి, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.